క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: ఒంటరిగా జీవించే వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం కొందరు అర్థాకలితో అలమటిస్తున్నారని, అటువంటి వారికి ఇతోధికంగా సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నగరంపాలెం: శివరాత్రి పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాగరాజుకాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగపై ప్రచారం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టతను తెలియజేసే పుస్తకాలు స్థానికులకు అందించారు. కార్యక్రమంలో గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు బి.శివలింగంనాయక్, టి.బ్రహ్మం, పట్టాభి శ్రీను, జె.హరిబాబు, ఎ.అరుణ పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోవాలి

లక్ష్మీపురం: రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకీ దారుణంగా ఉందని, అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొత్తపేటలోనిసీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నేడు ఉందన్నారు. రైతుల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచకుండా వ్యవహరిస్తున్న తీరు రైతులకు శాపంగా మారిందని తెలిపారు. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడుతున్నారన్నారు. ఇవాళ మిర్చి రైతుల గోడు తీవ్రస్థాయిలో ఉందని, ధాన్యం, పత్తి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యల్ని పరిష్కరించాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్, జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అలరించిన సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో గాన గంధర్వ పద్మశ్రీ ఘంటసాల వర్ధంతి, కళా తపస్వి కె.విశ్వనాథ్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. సెయింట్ లారెల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్, డాక్టర్ బి.ఆర్.సుఫీన్ మీడియా ఎంటర్టైన్మెంట్ (నరసరావుపేట) సౌజన్యంతో ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్, స్వర లాపన సంయుక్తంగా మెగా సంగీత విభావరి నిర్వహించారు. అంతర్జాతీయ అవార్డు గ్రహీత చంద్రతేజ స్వరార్చన చేయగా, గాయకులు బాబూరావు, బాలస్వామి, ఇస్మాయిల్ మధుర గీతాలు ఆలపించారు. అనంతరం దేవరకొండ బాలస్వామి, కంబాల బాబూరావు నిర్వహణలో గాయని అత్తోట సౌజన్యను మధుర గాన విశారద అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో మేకల రవీంద్రబాబు, కన్న మాస్టారు, బి.అశోక్, టి.రాజేంద్రప్రసాద్, మిరియాల ప్రసాదరావు, గోపీకుమార్ పాల్గొన్నారు.

పసి గుండెకు అమ్మ కడుపులోనే కష్టం

- కొందరు శిశువులకు పుట్టుకతోనే గుండె జబ్బులు
- వయస్సు పెరిగే కొద్ది కొందరిలో సాధారణ స్థితికి
- శస్త్రచికిత్సతో మరికొన్నింటికి పరిష్కారం





గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా పలువురు గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ఇందులో కొంత మంది పసికందులు అమ్మ కడుపులో నుంచి బయటకు రాకుండానే గుండె సమస్యతో అల్లాడిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా జరిగే ప్రతి వెయ్యి ప్రసవాల్లో పది మంది శిశువులు పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరు జీజీహెచ్ ఆవరణలో ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రం (డైక్)లో 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు 49 మంది చిన్నారులు గుండె జబ్బులకు చికిత్స పొందినట్లు డైక్ సెంటర్ వైద్యులు వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ చిన్నపిల్లల విభాగానికి సైతం ప్రతిరోజూ 300 మంది చిన్నారులు వివిధ వ్యాధులతో చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో ఇద్దరు చొప్పున నెలకు సగటున 50 నుంచి 60 మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు. ఇలాంటి పిల్లలను చూసే అప్పట్లో దివంగత డాక్టర్ వైఎస్సార్ చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ పథకం పురుడు పోసుకుంది. ఇప్పుడు ఇదే పథకం ఎన్నోవేల మంది చిన్నారులకు ప్రాణం పోస్తోంది.

ఎకో కార్డియోగ్రామ్‌తో నిర్ధారణ

గర్భస్థ శిశువుల్లో గుండె లోపాలను 18 వారాల గర్భంలోనే ఫీటల్ ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. దీని ద్వారా గుండె లోపాలు, బిడ్డ ఆరోగ్యం తెలుసుకోవచ్చు. దీన్ని బట్టి ముందుగానే శస్త్రచికిత్సలను నిర్ణయించుకోవచ్చు. కవాటాలు మూసుకుపోయిన వారికి కొన్నిసార్లు గర్భంలో ఉండగానే సరిదిద్దే పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి.

పిల్లల్లో గుండె జబ్బులకు కారణాలు

- ఫోలిక్ యాసిడ్, విటమిన్–బీ12 లోపం గర్భస్థ శిశువులో గుండెలోపాలకు దారి తీయవచ్చు.
- తొలి మూడు నెలల్లో ముఖ్యంగా గర్భస్థ పిండంలో గుండె ఏర్పడే దశలో రుబెల్లా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు సైతం లోపాలకు దారి తీయొచ్చు.
- మేనరికపు వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో జన్యు పరమైన కారణాలతోనూ గుండె లోపాలు తలెత్తవచ్చు. పుట్టబోయే పిల్లల్లో ప్రతి వెయ్యి మందిలో 40 నుంచి 50 మందికి గుండె లోపాలు ఉండే అవకాశం ఉంది.
- గుండె గదుల మధ్య రంధ్రాలు ఉన్నప్పుడు చెడు రక్తంతో మంచి రక్తం ఎక్కువగా కలిసిపోతుంది. దీంతో ఊపిరితిత్తులకు మరింత ఎక్కువగా రక్తం చేరుకుంటుంది. ఫలితంగా తడితడిగా అయిపోతాయి. దీంతో పిల్లలు పాలు సరిగా తాగలేరు. ఆయాసం, తరచూ న్యూమో నియా బారిన పడుతుంటారు.
- చెడు, మంచి రక్తం కలిసి పోయి ఒళ్లంతా విస్తరించడం వల్ల పెదాలు, వేళ్లు, నాలుక వంటివి నీలంగా మారతాయి. కొందరికి ఉన్నట్లుండి నీలంగా అవడం ఎక్కువ కావచ్చు. కనుగుడ్లు తేలేయొచ్చు.
- కవాటాలు బిగుసుకుపోవడం, రక్తం లీక్ అయ్యేవారిలో అలసట, నిస్సత్తువ కనిపిస్తుంటాయి. ఇలాంటి వారు పెద్దయ్యాక శారీరక శ్రమను తట్టుకోలేరు. ఆటలకు దూరంగా ఉంటారు.
- కొందరికి జన్యులోపాలతోనూ గుండె నిర్మాణ ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు.
- గర్భం ధరించిన తొలివారాల్లో పురుగుల మందులు, రేడియేషన్, కొన్ని రకాల మందుల ప్రభావానికి గురైనా గుండె సమస్యలు తలెత్తవచ్చు.
- గర్భధారణ సమయంలో పొగ, మద్యం తాగడం వంటి అలవాట్ల తోనూ గుండె ఏర్పడే ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు. ఇది లోపాలకు దారి తీయొచ్చు.

జీజీహెచ్‌లో సమగ్ర వైద్యం



గుంటూరు జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య విభాగానికి ప్రతిరోజూ 300 మంది వివిధ వ్యాధుల చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో ఇద్దరు గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులు ఉంటున్నారు. పర్యావరణం, జన్యుపరం, వంశపారంపర్యం, పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, మేనరికపు వివాహాలు చిన్నారుల్లో గుండెజబ్బులు రావడానికి కారణాలు. జీజీహెచ్‌లో సమగ్ర వైద్యం అందించి ప్రాణాలు కాపాడుతున్నాం.

– డాక్టర్ బి.రమేష్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

గర్భంలోనే గుర్తించి సరి చేయవచ్చు



గర్భంలో శిశువు హృదయానికి ఏదైనా సమస్య ఏర్పడితే సరిచేసే ఆధునిక చికిత్సా పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. గర్భిణికి గైనకాలజిస్టులు టిఫా స్కానింగ్ చేయిస్తారు. దీని ద్వారా గర్భంలో శిశువుకు గుండె జబ్బులుంటే తెలిసిపోతుంది. సమస్య ఎక్కువగా ఉండి, గర్భస్థ పిండం వయస్సు 26 వారాల లోపు ఉంటే అబార్షన్ చేయించుకోవడం మేలు. సమస్య చిన్నదిగా ఉండి గర్భంలో పిండం పెరిగే సమయంలోనూ ఆపరేషన్ చేసి సరిచేసే అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

ముగిసిన భాగవత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గత ఆరు రోజులుగా సాహితీవేత్త పీఎస్ఆర్.ఆంజనేయప్రసాద్ జయంతిలో భాగంగా నిర్వహిస్తోన్న భాగవత రస వైభవం ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. రుక్మిణి అంటే జీవుడు, కృష్ణుడు అంటే దేవుడని పేర్కొన్నారు. దేవుడికి జీవుడికి అనుసంధానం అగ్ని అని, అందుకే కథలో రుక్మిణీదేవి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడి ద్వారా సందేశం పంపిందని వివరించారు. అనంతరం మంత్రాశ్రమ పీఠాధిపతి నరసింహానంద భారతీస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ, సాహితీవేత్త నారాయణం శేషుబాబు, పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు. చివరగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి దంపతులను సత్కరించారు.

ఘనంగా ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటుడు అలీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్కూల్ 26వ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు అలీ తన హాస్య చతురతతో విద్యార్థులు, తల్లిదండ్రులను అలరించారు. సమగ్ర హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కె. నీరజ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్ రెడ్డి పాఠశాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సీనియర్ లాయర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో లక్ష్యాలను ఏర్పచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సీనియర్ కౌన్సెలర్ కె. సురేష్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్ జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అన్నా నందకిశోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ కంప్యూటర్స్ అండ్ జనరల్ ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ టాపర్లుగా నిలిచినట్లు సంస్థ డైరెక్టర్లు శేషసాయిబాబు, అన్నా నందకిశోర్ తెలిపారు. కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరు డైరెక్టర్లు మాట్లాడారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో కె. తేజస్వి 700 మార్కులకు గానూ 543, షేక్ ఇమ్రాన్ 541, షేక్ షఫియా 540, షేక్ సౌమ్య తాహీరా 538, డి. త్రిషశ్రీ 521 సాధించినట్లు తెలిపారు. బీకాం జనరల్‌లో టి. ఆకర్ష నాగలక్ష్మి 600 మార్కులకు గానూ 508 , ఆర్. తేజస్విని 490, సింగి దిషా 485, ఎస్. సంగీత 477, వి. ఉమేష్ రాజా 470 సాధించినట్లు వివరించారు. రెగ్యులర్ తరగతుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ల్యాబ్ ప్రాక్టీసు కారణంగా ఈ స్థాయిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు

లక్ష్మీపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు హెచ్చరించారు. స్థానిక శ్యామలానగర్‌లోని పట్టాభిపురం పోలీసులు ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్‌ను నిర్వహించారు. వాహనదారులకు మౌత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేశారు. మద్యం తాగున్న వారిని గుర్తించి కేసులు బనాయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి వచ్చేంత వరకు కుటుంబ సభ్యులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: మెయిటెన్స్, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీహెచ్.హుస్సేన్ ఖాన్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతారామనగర్, మంగళదాస్‌నగర్, విజయవాడ రోడ్డు (వెస్ట్), రాజగోపాలనగర్, మద్దిరాల కాలనీ, బీటీఆర్ నగర్ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

- రవీంద్రనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్యామలానగర్, పట్టాభిపురం, రవీంద్రనగర్, శ్రీనగర్, స్తంభాల గరువు ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

హోమియోపతి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

లక్ష్మీపురం: హోమియో వైద్యంతో చిన్నా, పెద్దా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండవచ్చని డాక్టర్ ఉప్పల మారుతీనందన్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతీనందన్ మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానం సమగ్రమైనదని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలను త్వరితంగా సమూలంగా నిర్మూలించవచ్చని చెప్పారు.

మంచి పుస్తకాలతో కొత్త ఆలోచనలు

మంచి పుస్తకాలు చదవడంతో కొత్త ఆలోచనలు వస్తాయని విద్యావేత్త ఆర్.వి సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది మేధావులు, పెద్ద వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలకు పుస్తకాలు చదవందే రోజు గడవదని తెలిపారు. విశ్లేషకులు ఎన్.సదాశివం, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఉన్నతమైన సాహిత్యానికి మకిలి అంటించడం, మతోన్మాద రంగుటద్దాల నుంచి చూడటం ఈ మధ్య పరిపాటిగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల



జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రాయపాటి శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని జేకేసీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు సంయుక్తంగా నిర్వహిస్తున్న 28వ చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజేతగా భీమవరంలోని సాగిరామకృష్ణంరాజు (ఎస్ఆర్‌కేఆర్) ఇంజినీరింగ్ కళాశాల 'ఏ' జట్టు నిలిచింది. ఆదివారం జేకేసీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తుది మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 136 పరుగులు తీసింది. అనంతరం ఫీల్డ్‌లోకి దిగిన ఎస్ఆర్‌కేఆర్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 137 పరుగులతో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఉత్తమ బ్యాట్స్‌మేన్‌గా సంతోష్ (ఎస్ఆర్ఎం వర్సిటీ), ఉత్తమ బౌలర్‌గా సుబ్బరాజు (ఎస్ఆర్‌కేఆర్ ఏ జట్టు), ఉత్తమ ఆల్ రౌండర్‌గా ఉదయ్ (ఎస్ఆర్ఎం వర్సిటీ) నిలిచారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో, జేకేసీ కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, జేసీ లా కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కె. సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, పోటీల నిర్వహణ కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ విజయబాబు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల నేడు చిన్నారుల్లో సైతం కంటి సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక దశలోనే చికిత్స చేయడం ద్వారా చూపు పోకుండా కాపాడవచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ బైరపనేని విజయబాబు అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం తాడికొండలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరగడంతో పిల్లల్లో కంటి చూపు సమస్యలు బాగా పెరుగుతున్నాయని చెప్పారు. ఆకుకూరలు, క్యారెట్, పౌష్టికాహారం తీసుకుంటే కంటి చూపు బాగుంటుందని సూచించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనం వల్ల నేడు యువత కూడా గుండెపోటుకు గురై మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండెను పదిలంగా కాపాడుకోవచ్చని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచితంగా 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లలిత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ, అప్తమాలజీ, జనరల్ సర్జరీ విభాగాల వైద్యులు పరీక్షలు చేసి సలహాలు అందజేశారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ ఉమా శంకర్, న్యూరాలజిస్ట్ డాక్టర్ యస్వంత్, తాడికొండ గ్రామ పెద్ద మండూరు అక్బర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత కొర్నెపాడు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు, సొగంధ్ కృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: రూరల్ మండలం పొత్తూరులోని అక్మే స్కూల్ క్యాంపస్‌లో ఆదివారం జరిగిన అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో అండర్–14 జూనియర్ విభాగంలో కొర్నెపాడు జెడ్పీ హైస్కూల్ టీం ప్రథమ స్థానంలో నిలిచింది. లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ద్వితీయ, అక్మే స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–12 పోటీల్లో అక్మే స్కూల్ ప్రథమ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సెయింట్ జోసఫ్ హైస్కూల్ టీంలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పాఠశాల డైరెక్టర్ నందమూరి సొగంధ్ కృష్ణ అభినందించారు.

• అటు ఖేదం.. ఇటు మోదం

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ వ్యాపారం పడిపోయింది. బాగా ఉడికించి తినవచ్చని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కూడా ఫలితం లేకుండా పోయింది. వైరస్ భయంతో చికెన్ దుకాణాల వంక చూడటం లేదు. మాంస ప్రియులు చేపలు, మటన్ వైపు మళ్లారు. దీంతో పట్టణంలోని మటన్ దుకాణాలు, చేపలను అమ్మే ప్రాంతాలు రద్దీగా మారాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



భారీగా చేపలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు



మటన్ దుకాణంలో రద్దీ



గుంటూరు నగరంలో వెలవెలబోతున్న చికెన్ సెంటర్

• పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన వట్టిచెరుకూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గారపాడులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 18 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ 1.30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.